

# 19 ఇరుసున బెట్టని కందెన

"చావు పుటకలాఫీసులో ఆడు చౌదరిగారి పుటక తేదీకి సర్టిఫికెటింత వరకూ ఈంలే" అన్నాడు సుబ్బరాజు వచ్చి కూర్చుంటూ.

"దానమ్మశిఖా...అదేటయ్యా? అయన్నీ గడికో గంటకో వస్తయే... గిట్టనోళ్ళెవరేనా మీకన్నా ఎక్కువ తడిపుండాలాడిని - కాగితం అలీసెం జెయ్యడానికి" అన్నారు రెడ్డిగారు నవ్వి.

"అబ్బే. అసలు మనోళ్ళు కడతేరా తడపలే. పంతా లొచ్చినయి. ఆడు రేటు పెంచాడు. మామూలు రోజుల్లో మామూలు పన్లకిచ్చే మామూలే ఎలక్షను రోజుల్లో ఎలక్షను పన్లక్కావలసిన కాయితాలకీ ఇస్తే ఎలాగండీ అంటాడాడు... నివ్వడిగే డబ్బుతో పాకిస్తాన్ కంట్రాక్టుకి తీసుకొని డెమాక్రసీ కట్టించొచ్చునంటారీళ్ళు".

రామిరెడ్డిగారు నవ్వి వూరుకున్నారు.

"పెద్దంత్రం చిన్నంత్రం వద్దాని" అన్నాడు సుబ్బరాజు.

"అఁ ఎక్కడికిలే. ఎవుడూ పెద్దగాడు. ఒకడు పెద్దయితే ఈ గుమాస్తాగాడి కొరిగి సచ్చేదేటి? అసలదీగాక, పెద్దలొచ్చారని రివాజైన ధర్మాలేడకి బోతాయి? అమద్ది నోమారు జవహర్లాల్ నెహ్రూగారు స్వయంగా ఓ కో అపరేటివ్ సొసయిటీ బెట్టించారు. రెండు మూడేండ్లయిందనుకుంటా. అది రిజిస్ట్రీ గావడానికి కాయితాలు పడేశారు సొసయిటీ వోళ్ళు. కాని కదిల్రావే. ప్రధానమంత్రిగారి ప్రమేయం ఉన్న పని అని వీళ్ళు, పని అని మాత్రవేఁ అని అవతలోళ్ళు అనుకున్నారు గావాల. అర్నెల్లయినా రిజిస్ట్రీ కాయితాలు కదిల్సావలే. ఆవటా పెద్దాయన కోంబడి - నాలాటోడు చెయి జేసుకున్న పన్లే మీ రెడ్డు టేపులోబడి ఇన్నాళ్ళు దీసుకుంటే, జనం గతేంగానూ అని ఇదయి పొయ్యాడు."

"అసలీ కాయితాలు కదలవు. కొన్నాళ్ళలోగా కదిలించబోతివా అనాక గాలేసి ఎగిరిపోతాయి. అందుకనే 'బరువేదేనా' పెట్టమన్నారు మరి. ఆ బరువు ఎంతనేదే తెలియాలి. తక్కువైతే కాయితవూ, బరువూ కూడా ఎగిరిపోతాయి. మరీ ఎక్కువయినా చిక్కే. అన్ని బల్లల మీదా అలాగే బరువులు బెట్టాలి. శివరావని ఓ ఖడేరావుండేవాడు. ఈ బరువులూ తూకాలూ ఆయనకి తెలిసినట్టు మరొకడికి తెలీవు. ధర్మరాజులే. తూకాన్ని మీరి తుల వెఁక్కువ దీసుకున్నట్లగుపించేవాడు కాదు.

ఊళ్ళో పెద్దలికీ ఆఫీసులో పెద్దలికీ కూడా హడలే శివరావంటే. ఏ ఆఫీసులో పెట్టినా అంతే. అసలు అధికార్లు చేసిన పెద్ద పొరపాటేవిటంటే శివరావుని పదిరకాల ఆఫీసులకి, జిల్లాల తాలూకాల వారీగా బదిలీలు చెయ్యడం. ఎక్కడికక్కడ ఆయనకి శిష్యగణం తయారయ్యేది. ఏవుంది విద్దె నేర్వంగానే ఇహ గురువుకి నామాలు పెడితే దప్పు పని కాదనుకొని ఆ పని చేసేవారు. ఆయన కొత్తచోట ఇంకా బాగా నొల్లుకోవచ్చునని జరిగేవాడు. నువ్వాయన్నెలాంటి ప్ర్రలో పడెయ్యి. దాన్ని సాగుకు లాయికీ జేసేవాడు. వనరులున్న పీడబుర్రీలో ఎంతలా పండించాడో ఇంకో దాంటోనూ అలాగే పండించేవాడు. ఎ్రరటేపు ముళ్ళు కట్టడం, విప్పడంలో, బ్రహ్మ ముళ్ళు కట్టడం, విప్పడంలో బ్రహ్మకి బ్రహ్మముళ్ళు గురించి తెలిసిందాని కన్నెక్కువ దెలుసు. ఆ తాళ్ళు లాగి, కథని ఆడించడంలో తోలుబొమ్మ లాటగాని కన్నా ఒడుపులు తెలుసు.

వెనకటికో కథ జెప్పారు చూడు. పరమ లంచగొండి నొకణ్ణి ఏం జెయ్యాలో దోచక విసుగెత్తి రాజుగారు దివాణంలో గంటలు కొట్టే పనికి బెట్టాడు - ఇహ వీడెలా గడిస్తాడో చూదామని. అర్నెల్లయ్యాక, "ఏరా, పైనేమన్నా గడిస్తున్నావా ఇంకా" అన్నారుట విలాసంగా. చిత్తం ఏలినవారి దయుండగా కొరవేవిటి? పూర్వంకన్నా మెరుగేనన్నాట్ట వాడు. రాజావారు తెల్లబోయి ఏవిటి నీ కథ చెప్పమన్నారు. తలగాస్తానని మాట తీసుకొని వాడు చెప్పేశాడు. రాజుగారి కిద్దరు భార్యలు, పెద్దరాణి భవంతిలో నడిరేయి దాకానూ, చినరాణి భవంతిలో మూడు నాలుగు ఝాములూ గడపటం రివాజు. వీడది చూసుకొని గంటలు కొంచెం తొందరగా కొట్టి ఝామున్నరలో రెండు ఝాములు నడిపించాడు. అక్కడితో పెద్దరాణిగారు ఇది చిన్నామె పని అని ఊహించి, గంటల వాడికి కబురంపి బహూమానమిచ్చింది. ఆనాక వీడు ఈవిడింట రెండు ఝాములనీ మూడో ఝాముదాకా పొడిగిస్తూ గంటలు కొట్టాడు. ఆ వైనం తెలిసి చిన్నామె తృణరాశి అంత డబ్బు తృణంగా ఇచ్చింది. ఈరకంగా ఏలంపాటలా పెంచి గడించాడు వాడు. దరిమిలాను, తన మోజును బట్టి కదిలే వీలు కోసం రాజుగారు కూడా అడపాదడపా మంత్రపుష్పం మంజూరు చేయిస్తూ వచ్చారు.

శివరావుగారు వాణ్ణి చంపి పుట్టాడు. వాడి అంశలు ఈనాడు మన డిపార్టుమెంట్లలో వెలిసి తామర తంపరలా వర్ధిల్లాయి.

రాజులే అలా దారికొచ్చి ఇలాంటి కళాకారుల్ని గౌరవించగా లేంది, ఇహ మంత్రులెంతగా మన్నించుకోవాలో నువ్వే చెప్పు మరి. రాజుల రోజులు పోయాక, కళల పోషణ మంత్రులపైనా, ప్రజలపైనా బడింది కదా!

అయినా శివరావు వంటి వాణ్ణి సుంకాల అంకయ్య "నివ్వెంత? పో" అన్నాడు అజ్ఞానం కొద్దీ. అప్పటి కతనో మినీస్ట్రుగారి బంధువు, రాజకీయాల్లో పైకొస్తున్న నాయకుడూను.

'కాయితాల మీద బరువు పెట్టండి' అని శివరావు అనగానే అసలాయన కర్థం దెలీక 'బరువు నే పెట్టడవేవిటి? ప్యూన్ను పిలిచి పెట్టమను' అని మాట విసిరికొట్టి వెళ్ళాడు.

గాలి విసురుగా వేసిందిగావును. కాగితాలు ఎగిరిపోయినట్లున్నాయి. దరిమిలాను వాటిని వెతికి తేవడానికి ఎన్ని నెలలో పట్టింది.

ఆనాటి వరకూ సాధించేందుకు ఘనకార్యాలంటూ ఏవీ లేకుండా ఉన్న అంకయ్య గారు, ఈవిధంగా అయిదారు పెద్ద నోట్లు వదలిపోవడంతో ఈ లంచగొండితనము, అవినీతి నిర్మూలన అనే దాన్ని దొరకబుచ్చుకొని ఉపన్యాసాల్లంకించుకున్నాడు. అదే తన జెండా అని ఎగరేసి పేరు దెచ్చుకున్నాడు. ఎలక్షన్లకి నిలబడి గెలిచి, మంత్రాంగ నిర్మాణ యంత్రాంగంలో హైక్లాసు లూబ్రికేషను జేసే ఒడుపులు దెలీక అవదం చేతులికి పూసుకుని దిగజారిపోయాడు. మళ్ళీ కొన్నాళ్ళు లంచగొండితనం మీద ఉపన్యాసాలిచ్చి హడావిడి చేశాడు. ఈ మధ్యలో శివరావుని బర్తరఫ్ చేయించాలని ప్రయత్నాలు చేస్తూ వచ్చాడు. అయిన వాళ్ళు నవ్వారు. రామాయణంలో పిడకల వేటలాగిదేటయ్యా అని. అదీగాక, ఉజ్జోగుల జోలికి అందులో రాటుదేలిన ఘటాల జోలికి, కొన్ని డిపార్టుమెంట్ల జోలికి పోరాదని హితవు చెప్పారు. డిపార్టుమెంటోళ్ళు నిన్ను జూసి అగ్గగ్గలాడితే చూసి ఆనందించాలే దప్ప జులుం జేసి హద్దు మీరవద్దన్నారు. ఈ అధికారం అనే ఆ యొక్క భవంతిలో అన్ని ద్వారాలూ దెరిచి అన్ని గదుల్లోకీ వెళ్ళుగాని, ఆ ఒక్క ద్వారం జోలికి పోవద్దన్నారు. అంకయ్య విన్నాడు కాదు. ఐదారుసార్లు దండెత్తాడు. ముఖ్యంగా శివరావుని ఇరికించాలని చూశాడు పంతంకొద్దీ.

బొంకాడ నేరిస్తే గాని రంకాడ రాదన్నారు జూడు. శివరావు విద్య ముందు అదే సాధించాడేమో అంకయ్య పట్టుకు అంకలేదు. ఓమారు ఒహ పెద్దమనిషి లంచం ఇవ్వబోతున్నాడని దెలిసి నోట్లు నంబర్లు రాసుకొని, పోలీసుల్ని మాటుబెట్టి ఆ నోట్లు శివరావు చేతికివ్వగానే వాళ్ళొచ్చి చుట్టుముట్టి పట్టుకునేలా వ్యూహం వేశాడు అంకయ్య.

శివరావు భయపళ్ళేదు సరేగదా వాళ్ళ న్జూసి పకాల్న నవ్వాడు. ఎదురు దబాయించాడు. ఈనగారికి మొన్న చేబదులిప్పించిన పెద్ద మనుషున్నాడూ, ఇదాయన్దీ. ఆయనెవరో, ఆయన పేరేమిటో చెబుతే మీరీ చాయలికి రారూ అన్నాడు. ఆనాక అందులో ఒకణ్ని ఆ పేరు చెబుతా రమ్మని పక్కకు తీసుకెళ్ళి చెప్పాడు... కేసు కామాపయిపోయింది. ఇలా నాలుగైదు దఫాలయ్యేసరికి అంకయ్యకి తిక్క పెరిగి దొంగ సాక్ష్యాలు తయారుచేయించాడు. మరి నిజం సాక్ష్యాలు బైటికి రావాయె. రప్పించినా రాజులూ, మంత్రులూ ఉంటారాయె. అధర్మాన్ని ధర్మంతోనే గొట్టాలని సర్ది చెప్పకు నీ యేర్పాటు చేశాడు. లంచగొండి కమిటీ ఒకటేశాడు. వాళ్ళచేత రిపోర్టు తయారుచేయించి దాన్ని ప్రభుత్వం దగ్గిరికి దెప్పించబోయాడు. ఆ నివేదిక రాయడం, టైపు చేయడం, కాయితాలు దొంతర్లు బెట్టడం, దానికి పిన్నులు గుచ్చబోతే అవి వంగిపోవడం, స్పెషలు సైజు పిన్నులు తెప్పించడం, వాటికీ ఆ బొత్తి లొంగక పోవడం, ఫారిన్ పిన్నులకి ఇండెంటు పెట్టడం, అది ఢిల్లీలో శ్రీ మినిస్ట్రి ఆఫ్ కామర్సు ఎం డిండస్ట్రి వారికి వెళ్ళడం, ఇంపోర్టు ఇరకాటాలూ, కొత్త బడ్జెట్టు, పిన్నులు రావడం, ఢిల్లీ నుంచి ఆదేశం రావడం, ఈలోగా సిరా ఒలికి బొత్తి పాడవటం, కొత్త కాయితాల కిండెంట్లు అలస్యం దేనికైందని ఓ కమిటీ, అది మీటింగులు పెట్టడం, ఎక్కడ జరగాలి అన్న దాని మీద రభసలు, రాయలసీమ,

తెలంగాణా వర్గాలలో అసంతృప్తి, నిరసనలూ, నిరశన వ్రతాలూ, ఊరేగింపులూ, చివరికి కమిటీ మీటింగులూ, రిపోర్టు రాయడం, అది వచ్చేవరకూ అసలు రిపోర్టు ఆగడం, ఎర్రటేపు ముళ్ళు చిక్కులు పడటం, ఆ రిపోర్టు కాగితాలు వీటిలోకీ, దీనివి దానిలోకీ పోవడం.... వగైరాలు అన్నీ యధాప్రకారం జరిగాయి.

'గిట్టనివాళ్ళు' అంతా పోగై లంచగొండి రిపోర్టేదీ అని సభలో అంకయ్యను నిర్దేశడిగారు. లాలూచీ అయ్యాడా అని ఎద్దేవా చేశారు. ఎరక్క చిక్కుపడ్డాం దేవుడా అనిపించింది అంకయ్యకి. రోషంతో శివరావు మీద విరుచుకుపడి ఇంక్వైరీ బెట్టించి బర్తరఫ్‌కి ఆర్డర్లు వేయించాడు.

ఈలోపల కొత్త ఎలక్షన్లు కనుచూపు మేరలో కొచ్చాయి. ఏణ్ణర్థం ముందరే జాగర్తపడి ప్రచారం ఆరంభించాడు అంకయ్య. ప్రజామిత్రుడనీ, సన్నకారు జీవాల బలం అనీ ఉద్యోగుల సంరక్షకుడు అనీ అనిపించుకున్నాడు. అడగని వానిది పాపం అన్నట్టు సభలకీ, సన్మానాలకీ వెళ్ళసాగాడు. ముసలి రైతుకు ఎనభై మూడవ ఏడు వచ్చిన సభ, పన్నెండోసారి స్కూలు ఫైనలు తప్పిన విద్యార్థికి రజతోత్సవం, ఒక ముసలి ఉద్యోగికి రిటైర్ అయిన తరువాత ఏడోసారి పదవి పొడిగింపు సభకీ – ఇలా అన్నిటికీ వెళ్ళాడు. పేరు మారు మోగిపోయింది. అంతలో ఒక బ్రహ్మాండమైన సభ రాబోతూందని తెలిసింది. దానికి రెండు జిల్లాల ప్రజలు ఏకమై ప్రోత్సాహంతో ఉత్సవం చేస్తున్నారట. ఎవరో ఒక వృద్ధమూర్తి పదవీ విరమణ చేస్తున్నాడు. వీడ్కోలు సభ. దానికింకెవరో అధ్యక్షత వహిస్తారని తెలిసింది. కాని, చివరికి వారిని వక్తలుగా వేసి అంకయ్యగారిని అధ్యక్షులుగా పిలిచేవరకూ అంకయ్యగారు నిద్రపోలేదు.

చివరికి సభకు వెళ్ళినవాడు వేదిక ఎక్కగానే కళ్ళు తేలిపోయాయి. ఎంచేత సుబ్బరాజూ? నిద్రమత్తు వల్లనా? నీరసం వల్లనా? పైత్యం వల్లనా? గోడపైన అందమైన సినిమా హీరోయిన్ బొమ్మ పెట్టినందువల్లనా? ఎదర సభలో అప్పులాళ్ళు కనబడినందువల్లనా? మెడ బెణికినందు వల్లనా? అన్నారు రెడ్డిగారు కథ ఆపుజేస్తూ.

"ఏంకాదు ఆ ఉద్యోగ విరమణ సభ శివరావు గారిదై ఉంటుంది. రెండేళ్ళనాడు వేసిన బర్తరఫ్ ఆర్డరు కాయితాలు ఇంకా డిపార్టుమెంటు దాకా వచ్చే ఉండవు. ఈలోగా శివరావుగారికి వైసు నిండింది. రిటైరై పింఛను తీసుకునే టైమొచ్చింది. ఇరుసున కందెన బెట్టక పరమేశ్వరుని బండియైన బారదు సుమతీ" అన్నాడు సుబ్బరాజు నవ్వి.

★ ★ ★